

'మాఫీ' అయిందా..? లేదా?

పంట రుణం మాఫీ అయిందా..? లేదా? అని రైతులు మండల కేంద్రంలోని ఎస్బీఐలో ఆరా తీస్తున్నారు.

8లో ▸



ఫార్మాకు భూములివ్వం

ప్రాణాలైనా ఇస్తాం కానీ.. ఫార్మా కంపెనీలకు భూములిచ్చేది లేదని పోలేపల్లి రైతులు తేల్చి చెప్పారు.

8లో ▸



అందని బిల్లులు..

అభివృద్ధి పనులకు సొంత నిధులు వెచ్చించిన మాజీ సర్పంచులకు బిల్లులు అందక అవస్థలు పడుతున్నారు.

9లో ▸

న్యూస్‌రీల్

విద్యార్థుల చదువుపై దృష్టి సారించాలి

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

దోమ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సూచించారు. మంగళవారం దోమ మండలం గుండాల పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వసతులు, అమ్మ ఆదర్శ పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసు నిందితుడికి జీవితఖైదు

వివరాలు వెల్లడించిన ఎస్పీ నారాయణరెడ్డి



యాలాల: హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి జీవిత ఖైదు తోపాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ స్పెషల్ సెషన్స్ కోర్టు తీర్పునిచ్చింది. మంగళవారం కేసు వివరాలను ఎస్పీ నారాయణరెడ్డి వెల్లడించారు. యాలాల మండలం విశ్వనాథ్‌పూర్‌కు చెందిన నింగగళ్ల అంబరప్ప, షేక్ మహబూబ్ స్నేహితులు. అంబరప్ప తన భార్యతో లైంగిక సంబంధం కొనసాగిస్తున్నాడన్న అనుమానంతో షేక్ మహబూబ్ కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో జూన్ 15, 2020న అంబరప్ప తన కోడలు వెంకటమ్మ, కొడుకు(7) నవీన్‌తో కలిసి కల్లు కోసం వెళుతుండగా మార్గమధ్యలో వారిని షేక్ మహబూబ్ అడ్డగించాడు. కులం పేరుతో దూషిస్తూ, పదునైన కత్తితో నవీన్‌పై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ విషయమై అప్పట్లో షేక్ మహబూబ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తోపాటు హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసును అప్పటి తాండూరు డీఎస్పీ లక్ష్మీనారాయణ (ప్రస్తుత అదనపు డీసీపీ, కరీంనగర్) కేసు ట్రయల్స్‌లో హాజరై కోర్టుకు వివరాలు వెల్లడించారు. వాదనలు విన్న ఎల్బీనగర్ స్పెషల్ సెషన్స్ కోర్టు జడ్జి ఎం.భవానీ నిందితుడికి జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా ట్రయల్స్‌లో పాల్గొన్న డీసీపీ లక్ష్మీనారాయణ, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, ఏపీపీ ప్రతాప్‌రెడ్డి, సీడీఓ శ్రీశైలం, మరో అధికారి శ్రీనివాస్‌గౌడ్‌కు ఎస్పీ అభినందనలు తెలిపారు.

గణేశ్ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

షాద్‌నగర్: గణేశ్ ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని శంషాబాద్ డీసీపీ రాజేష్ అధికారులకు సూచించారు. వినాయక చవితి ఉత్సవాలకు పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని మల్లికార్జున ఫంక్షన్‌హాల్‌లో షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. గణేశ్ మండపాల వద్ద ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి మండపం వద్ద పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిర్వాహకులు విధిగా పోలీసుశాఖ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. నిమజ్జనం కోసం అధికారులు చెరువులను గుర్తించి అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఏఓ జ్యోతి, ఎస్ఎస్ఓ జగన్, పట్టణ సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ సుశీల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెరువుల పరిశీలన

షాద్‌నగర్‌రూరల్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిమజ్జనోత్సవానికి మంగళవారం శంషాబాద్ డీసీపీ రాజేష్ చెరువులను పరిశీలించారు. పట్టణ సమీపంలోని బొబ్బిలి చెరువుతో పాటు మండల పరిధిలోని బుచ్చిగూడ చెరువును పరిశీలించి ఆయా చెరువుల్లో నీటి సామర్థ్యం, నిమజ్జనానికి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఆయన వెంట ఏసీపీ రంగస్వామి, సీఐ విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

శుభ్రతతోనే ఆరోగ్యం

'దోమ కాటుతోనే విష జ్వరాలు ప్రబలుతున్నాయి.. ఇప్పటి వరకు తాండూరు జిల్లా ఆస్పత్రిలో 350 మంది జ్వర బాధితులకు వైద్య సేవలందించాం. ప్రతిరోజూ వివిధ రకాల జ్వరాలతో 120నుంచి 150మంది చిన్నారులు మాతాశిశు ఆస్పత్రికి, మరో వంద మంది పెద్దలు జ్వరంతో జిల్లా ఆస్పత్రికి వస్తున్నారు. ఈ నెలలో నాలుగు డెంగీ కేసులు నమోదయ్యాయి. అన్ని జ్వరాలు డెంగీ కాదు.. జ్వరం వచ్చిన వారు భయాందోళనకు గురికారాదు. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందుతోంది. పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండొచ్చు. వ్యాధి లక్షణాలుంటే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలి.' అని తాండూరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిశంకర్, ఆర్ఎంఓలు ఆనంద్ గోపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి సూచించారు. 'సాక్షి' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఫోన్ ఇన్‌కు విశేష స్పందన లభించింది. పలువురు అడిగిన సందేహాలను వారు నివృత్తి చేశారు. – తాండూరు





ఫోన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న వైద్యులు రవిశంకర్, గోపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి

దోమ కాటుతోనే విషజ్వరాలు

- అన్ని జ్వరాలు డెంగీ కాదు
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- తాండూరు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిశంకర్, ఆర్ఎంఓలు ఆనంద్ గోపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి

సాక్షి ఫోన్ ఇన్

రెండు రోజుల క్రితం గ్రామంలోని ఓ వ్యక్తికి డెంగీ జ్వరం వచ్చింది. ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వ్యాధి నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

– బండెప్ప, ఇందూర్, పెద్దేముల్ మండలం

వైద్యాధికారి: డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే జిల్లా ఆస్పత్రికి వచ్చి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. ఆస్పత్రిలో ప్లేట్ లేట్స్ కౌంటింగ్ యంత్రం, లాబ్ అందుబాటులో ఉంది. ఎవరూ భయాందోళన చెందాల్సిన పనిలేదు.

రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా. వాంతులు కూడా అవుతున్నాయి. చికున్‌గున్యా అనే అనుమానం ఉంది. వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయా?

– రోహిత్, మల్‌రెడ్డిపల్లి, తాండూరు

వైద్యాధికారి: జ్వరంతో కూడిన వాంతులు అయితే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలి. గ్రామం అయితే సబ్‌సెంటర్ ఉంటుంది. తాండూరు జిల్లా ఆస్పత్రిలో డెంగీ, చికున్‌గున్యా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారు.

మా ప్రాంతంలో పారిశుద్ధ్యం లోపించి, దోమలు వృద్ధి చెందాయి. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు.

– నాగమ్మ, 2వ వార్డు, తాండూరు

వైద్యాధికారి: వర్షాకాలం కావడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఫీవర్ ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి. పారిశుద్ధ్యం, దోమల నివారణ గురించి మున్సిపల్ అధికారులతో మాట్లాడతాం. ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

తాండూరు ప్రాంతంలో వాయు కాలుష్యం కారణంగా ప్రజలు శ్వాసకోశ ఇబ్బందులు పడుతున్నారు. చర్మ వ్యాధులు కూడా సోకుతున్నాయి. జిల్లా ఆస్పత్రిలో స్కిన్ డాక్టర్లు ఉన్నారా?

– వామన్‌రావు, తాండూరు

వైద్యాధికారి: జిల్లా ఆస్పత్రిలో శ్వాసకోస, చర్మ వ్యాధి నిపుణులు అందుబాటులో లేరు. ఈ విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పోస్టులను భర్తీ చేస్తారు.

తాండూరు జిల్లా ఆస్పత్రిలో ఓపీ సేవలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకే నిర్వహిస్తున్నారు. అత్యవసర వైద్య సేవల విభాగానికి వెళ్తే రేపు రమ్మని అంటున్నారు. 24 గంటల ఓపీ సేవలను అందుబాటులోకి తేవాలి.

– రషీద్, గాజీపూర్, పెద్దేముల్ మండలం

వైద్యాధికారి: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయి. ఆతర్వాత అత్యవసర వైద్య విభాగంలో 24 గంటల పాటు వైద్యం అందుతుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే 24 గంటల పాటు ఓపీ సేవలు అందిస్తాం.

అస్తమా సమస్యతో బాధపడుతున్నా. వ్యాధి నివారణకు సలహా ఇవ్వండి.

– నిరంజన్ గౌడ్, రాజీవ్ కాలనీ, తాండూరు

వైద్యాధికారి: అస్తమా, శ్వాసకోశ సమస్య ఉన్న వారు చల్లటి వాతావరణం నుంచి దూరంగా ఉండాలి. అస్తమా వల్ల ఒక్కోసారి బీపీ హెచ్చుతగ్గులు అయ్యే అవకాశం ఉంది. పరిస్థితి విషమంగా ఉంటే స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో వైద్యం పొందాలి.

తాండూరు జిల్లా ఆస్పత్రిలో అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తారా?

– దత్తాత్రేయా, గాంధీనగర్, తాండూరు

వైద్యాధికారి: జిల్లా ఆస్పత్రిలో అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తారు. రాష్ట్రంలోనే వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో తాండూరు హాస్పిటల్ ముందు వరుసలో ఉంది. డెంగీ, చికున్‌గున్యా లాంటి వ్యాధులకు పరీక్షలు చేస్తున్నాం.

చిన్నపిల్లలు సీజనల్ వ్యాధులకు గురవుతున్నాయి. జ్వరం తోపాటు జలుబు బారిన పడుతున్నారు. ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

– నసీర్, తాండూరు

వైద్యాధికారి: వర్షాలు పడుతున్నందున వాతావరణంలో మార్పులు వచ్చాయి. దీంతో పిల్లలకు జ్వరం, జలుబు వచ్చే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు సొంత వైద్యం చేయకుండా ఆస్పత్రికి తీసుకెళ్లాలి. విపరీతమైన కడుపు నొప్పి, తల నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు ఉంటే వైద్యులను సంప్రదించాలి.

దోమల వల్ల వ్యాధులు సంక్రమిస్తున్నాయి. వాటి నివారణకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టడం లేదు.

– జయరాం, జైరాంతండా, పెద్దేముల్ మండలం

వైద్యాధికారి: దోమల నుంచి సంక్రమించే వ్యాధుల నుంచి బయటపడాలంటే ప్రజలు రక్షణ చర్యలు తీసుకోవాలి. నిద్రించే సమయంలో దోమతెర వాడాలి. ఇంట్లోకి దోమలు రాకుండా చూసుకోవాలి. దోమల వల్ల మలేరియా, డెంగీ, విష జ్వరాల బారిన పడతారు. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.



ఎన్కతల చిన్న చెరువు అలుగుకు అడ్డంగా నిర్మించిన గోడను కూల్చివేస్తున్న అధికారులు

అక్రమ నిర్మాణం కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..

వికారాబాద్: మోమిన్‌పేట మండలం ఎన్కతల చిన్న చెరువు కబ్జాపై మంగళవారం సాక్షి జిల్లా ఎడిషన్‌లో ఖాళీగా కనిపిస్తే కబ్జా శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం అలుగుకు అడ్డంగా నిర్మించిన గోడను కూల్చివేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి గతంలో చెరువు సమీపంలో భూమి కొనుగోలు చేశాడు. బఫర్ జోన్‌ను వంద మీటర్ల మేర ఆక్రమించి గోడ కట్టాడు. ఈ విషయాన్ని మూడు నెలల క్రితం గ్రామ రైతులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో చెరువును సర్వే చేసిన రెవెన్యూ అధికారులు సదరు వ్యక్తి కబ్జాకు పాల్పడ్డాడని గుర్తించి ట్రెంచ్ కొట్టి వదిలేశారు. సాక్షి దినపత్రికలో కథనం రావడంతో అలుగుకు అడ్డంగా నిర్మించిన గోడను కూల్చివేశారు. పూర్తి స్థాయిలో సర్వే చేసి అక్రమార్కుల నుంచి చెరువుకు విముక్తి కల్పిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ గోవర్ధన్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



చెరువులను కాపాడండి

రంగారెడ్డి కలెక్టర్‌కు వినతి

మీర్‌పేట: కార్పొరేషన్‌లో కబ్జాలకు గురైన మూడు చెరువులను కాపాడాలని కోరుతూ 12వ డివిజన్ కార్పొరేటర్ ఇంద్రావత్ రవినాయక్ మంగళవారం కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేశారు. పెద్దచెరువు, చందన చెరువు, మంత్రాల చెరువుల బఫర్‌జోన్లను, కబ్జాదారుల ఆక్రమణల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. దీంతో పాటు నాలాలు ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తొలగించి, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కార్పొరేటర్ కరుణానిధి, బీజేపీ నాయకులు రవినాయక్, చెవ్వ శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

చెరువులను పరిశీలించిన హైడ్రా ఏఈ..

చెరువులను రక్షించాలని వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం హైడ్రా ఏఈ, ఎన్‌ఫోర్స్‌మెంట్ మెంబర్ మల్లికార్జున్ మీర్‌పేటలోని 3 చెరువులను పరిశీలించారు. చెరువుల బఫర్‌జోన్లు, ఎఫ్‌టీఎల్‌తో పాటు ప్రభుత్వ స్థలాల వివరాలు సేకరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న కృష్ణయ్య తదితరులు

రేపు జానపద జాతర

టీఆర్‌జేకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య

బొంరాస్‌పేట: సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే జానపద కళలను కాపాడుకుందామని రాష్ట్ర జానపద కళాకారుల సంఘం (టీఆర్‌జేకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణయ్య అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జానపద కళలను కాపాడేందుకు తమ సంఘం ఎంతో కృషి చేస్తూ కళాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 29న కొడంగల్ నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని రకాల జానపద కళలు, కళాకారులతో జానపద జాతర కార్యక్రమం ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల బడుగజంగాలు, తోలు బొమ్మలు, యక్షగానం, అడుగు భజన, చిరుతల, బైండ్ల తదితర జానపద కళాకారులు హాజరు కావాలన్నారు. సమావేశంలో సంఘాల నాయకుల సాయిలు, కేశవులు, శకనప్ప, వెంటకయ్య, డప్పు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ



మొయినాబాద్ రైతు వేదికలో అన్నదాతలతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

రంగారెడ్డి ఏడీఏ నర్సింహారావు

మొయినాబాద్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. మొయినాబాద్ రైతు వేదికలో మంగళవారం జరిగిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. రుణమాఫీ కాని రైతులు పలు సందేహాలను దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సాంకేతిక లోపంతోనే కొందరివి ఆలస్యం అవుతోందన్నారు. మాఫీ కాని రైతులు వ్యవసాయాధికారుల వద్ద ఆన్‌లైన్‌లో చెక్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అనురాధ, ఏఈఓలు కుమార్, సునీల్, రైతులు పాల్గొన్నారు.

బస్సులు మహాప్రభో!

కోస్గి డిపోకు అరకొర సర్వీసులు

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంలా తయారైంది కోస్గి ఆర్టీసీ డిపో పరిస్థితి.. రెండేళ్ల క్రితం 11 బస్సులతో ప్రారంభమైన డిపో నేడు 15 సర్వీసులతో నెట్టుకొస్తోంది.. పల్లె వెలుగు మినహా ఇతర ప్రాంతాలకు సర్వీసులే లేవు. డిపోలో సదుపాయాలు మచ్చుకైనా కానరావు, పూర్తి స్థాయి సిబ్బంది లేరు.

- పల్లె వెలుగు బస్సులు కరువు
- ఆటోలు, జీపుల్లో పాఠశాలలకు విద్యార్థులు
- ప్రధాన రూట్లలో వాహనాలు నిల్
- డొక్కు బస్సులతో నెట్టుకొస్తున్న వైనం
- నిత్యం ప్రయాణికుల పాట్లు



సౌకర్యాలు లేని కోస్గి బస్సు డిపో

కొడంగల్: నియోజకవర్గ పరిధిలోని కోస్గి ఆర్టీసీ డిపోను బస్సుల కొరత వెంటాడుతోంది. అరకొర సర్వీసులతో డిపోను నెట్టుకొస్తున్నారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. కోస్గి మండలంలో 30 గ్రామాలు, 60 వేలకు పైగా జనాభా ఉంది. నిత్యం వేలాది మంది ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేస్తుంటారు. ప్రయాణికులకు సంఖ్యకు తగినన్ని బస్సులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, తాండూరు లాంటి ప్రధాన రూట్లలో నామమాత్రంగా సర్వీసులు నడుస్తున్నాయి. అవి కూడా ఎప్పుడు ఎక్కడ ఆగుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. గతంలో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని మంజూరు చేయించిన కోస్గి ఆర్టీసీ డిపో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించలేక పోతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

11 బస్సులతో ప్రారంభం

రెండేళ్ల క్రితం కోస్గి డిపోను కాలం చెల్లిన 11 బస్సులతో ప్రారంభించారు. వీటిని ఎక్కువగా నారాయణపేటకు నడిపేవారు. ప్రధాన రహదారుల్లో బస్సులు కరువయ్యాయి. కేవలం పల్లె వెలుగులతో సరి పెడుతున్నారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, వికారాబాద్, తాండూరుకు బస్సుల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రెండేళ్లలో మూడు బస్సులే..

రెండేళ్ల క్రితం కోస్గి డిపోను అప్పటి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. కేవలం 11 బస్సులను కేటాయించారు. డిపో ప్రారంభమై రెండేళ్లు పూర్తయినా మూడు బస్సులే అదనంగా వచ్చాయి. ప్రస్తుతం 15 బస్సులతో డిపోను నిర్వహిస్తున్నారు. కోస్గిలో ఆర్టీసీ డిపో ప్రారంభమైతే నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు బస్సులు తిరుగుతాయని ప్రజలు భావించారు. కానీ చాలా గ్రామాలకు బస్సులు తిరగడం లేదు. దీంతో విద్యార్థులు ఆటోలు, జీపుల్లో పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ విషయంపై ఆర్టీసీ అధికారులను వివరణ కోరగా త్వరలో కొత్త బస్సులు వస్తాయని తెలిపారు. అద్దె బస్సుల కోసం ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. కొత్త బస్సులు వచ్చిన తర్వాత రవాణా సౌకర్యం మెరుగు పడుతుందని తెలిపారు. ఇప్పటి వరకు కోస్గి డిపోకు మేనేజర్‌ను నియమించలేదు. కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదు. బస్సులను శుభ్రం చేసే స్టాండ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. పూర్తి స్థాయిలో మెకానిక్‌లను నియమించలేదు.

విస్తరణకు నోచుకోని కొడంగల్ బస్టాండ్

తెలంగాణ – కర్ణాటక సరిహద్దులో రెండు జాతీయ రహదారులను కలిపే కొడంగల్ బస్టాండ్‌పై అధికారులు చిన్న చూపు చూస్తున్నారు. కొడంగల్ నుంచి నిత్యం వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఒకేసారి ఐదారు బస్సులు వస్తే ట్రాఫిక్ జామ్ అవుతోంది. కొడంగల్ బస్టాండ్‌ను 1979లో అప్పటి రవాణా శాఖ మంత్రి వెంగళరావు శంకుస్థాపన చేశారు. ప్లాట్‌ఫారాలు నిర్మించిన తర్వాత 1981లో అప్పటి ముఖ్యమంత్రి అంజయ్య, రవాణా శాఖ మంత్రి రోశయ్య చేతుల మీదుగా బస్టాండ్‌ను ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు బస్టాండ్‌ను విస్తరించ లేదు. నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్ నుంచి జిల్లా కేంద్రమైన వికారాబాద్‌కు బస్సు సౌకర్యం లేదు. వికారాబాద్‌కు వెళ్లాలంటే రెండు బస్సులు ఎక్కిదిగాల్సి వస్తోంది. పరిగి నుంచి వెళితే 52 కిలోమీటర్లు, తాండూరు నుంచి వెళితే 63 కిలోమీటర్ల దూరం అవుతోంది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోస్గి, కొడంగల్ బస్టాండ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రయాణకులు కోరుతున్నారు.



అభివృద్ధికి నోచుకోని కొడంగల్ బస్టాండ్

క్లుప్తంగా

సమస్యలను పరిష్కరిస్తాం

ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి



పాత కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఉమాహారతి, మంజుల

అనంతగిరి: ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనుల కారణంగా రైతులు రోడ్డు మీదే కూరగాయలు విక్రయిస్తున్నారు. దీంతో అటుగా వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయం మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి చైర్‌పర్సన్‌తో కలిసి రైతుబజార్, కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. మార్కెట్ మొత్తం బురదమయంగా మారిందని వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఉమాహారతి మాట్లాడుతూ.. సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపుతామన్నారు.

వేటకుక్కల దాడిలో జింక మృత్యువాత



జింక కళేబరం

పూడూరు: వేటకుక్కల దాడిలో జింక మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని దామగుండం అటవీ ప్రాంతంలో మంగళవారం చోటు చేసుకుంది. తరచూ వేట కుక్కల దాడిలో జింకలు మృత్యువాత పడుతున్నా అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్కలు, వేటగాళ్ల ఉచ్చులో పడి జింకలు మృత్యువాత పడుతూ వందల సంఖ్యల్లో ఉన్న జింకలు పదుల సంఖ్యల్లోకి చేరుతున్నాయి. రానున్న రోజుల్లో దామగుండం అటవీ ప్రాంతంలో జింకలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులకు విషయం వివరించినా పట్టించుకోవడం ఆరోపిస్తున్నారు. కలెక్టర్ స్పందించి సంబంధిత అటవీ శాఖ అధికారులను అప్రమత్తం చేసి జింకలను కాపాడాలని కోరుతున్నారు.

గుప్త నిధుల కలకలం!

పూడూరు: మండల పరిధిలోని ఎన్కేపల్లిలో గుప్త నిధుల తవ్వకాలు కలకలం రేపాయి. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దయాకర్ తన వ్యవసాయ పొలంలో మొక్కజొన్న పంటను సాగు చేశారు. పొలం మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు పెద్ద గుంత తవ్వారు. పరిసరాల్లో నిమ్మకాయలు, పూజ సామగ్రి కనిపించడంతో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టి ఉంటారని వెంటనే చన్గోముల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చంటిపాపతో తల్లి అదృశ్యం

యాచారం: చంటి పాపతో ఓ తల్లి అదృశ్యమైన సంఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కందుకూరు మండల పరిధిలోని గొట్టిలగడ్డ తండాకు చెందిన రాజు, అఖిల దంపతులు. సోమవారం అఖిల ఏడాది వయసున్న తన కూతురుతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. రాజు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

గుట్కాలు విక్రయిస్తే చర్యలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కా పాకెట్లు

పెద్దేముల్: నిషేధిత గుట్కాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెద్దేముల్ ఎస్ఐ గిరి హెచ్చరించారు. మండల పరిధిలోని గోపాల్‌పూర్ బస్టాండ్‌లో పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి రెండు సంచులు పట్టుకుని అనుమానస్పదంగా కనిపించాడు. దీంతో ఆయన్ను విచారించగా గ్రామానికి చెందిన బోయిన శ్రీకాంత్ కర్ణాటక రాష్ట్రం కుంచారం నుంచి పెద్దేముల్‌కు గుట్కా పాకెట్లు తరలిస్తున్నట్లు ఒప్పుకొన్నాడు. ఆయన వద్ద రూ.32,620 విలువైన 11,360 గుట్కాపాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

'మాఫీ' అయిందా..? లేదా..?

- రుణమాఫీపై రైతుల ఆందోళన
- బ్యాంకు వద్ద పడిగాపులు
- పట్టించుకోని సిబ్బంది



ఎస్‌బీఐ బ్యాంకు వద్ద రైతుల క్యూ

బొంరాస్‌పేట: పంట రుణం మాఫీ అయిందా..? కాలేదా? అంటూ నిత్యం మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)లో క్రాప్ లోన్ తీసుకున్న రైతులు బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నెల రోజులకు పైగా గ్రామాలు, గిరిజన తండాల రైతులు నిత్యం ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బ్యాంకు వద్దే క్యూ లో ఉంటున్నారు.

1,700 మంది రైతులు పడిగాపులు

స్థానిక ఐస్‌బీఐ పరిధిలో 3,200 మంది రైతులు పంటరుణాలు తీసుకున్నారు. రెన్యూవల్ చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం రుణ మాఫీ చేయడంతో 1,509 మంది రైతులకు రూ.17కోట్ల రుణమాఫీ అందింది. ఇంకా 1,700 మంది రైతులకు రుణమాఫీ కాలేదు. దీంతో రైతులు బ్యాంకు ఖాతా పుస్తకాలు, పంట రుణ పత్రాలతో బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్నారు. తమను పట్టించుకోవడం లేదని కొందలు రైతులు ఆగ్రహం చేస్తున్నారు. రుణమాఫీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతున్నారు.

మెస్సేజ్ వచ్చినా..



1.7ఎకరాల భూమి ఉంది. రూ.50 వేలు పంట రుణం తీసుకున్నారు. రుణమాఫీ అయినట్టు ఫోన్‌కు మెస్సేజ్ వచ్చింది. వ్యవసాయాధికారి వద్దకు వెళ్లి మాఫీ అయింది లేనిది చెప్పమని అడిగే వారు బ్యాంకుకు వెళ్లమంటున్నారు. బ్యాంకు వస్తే సిబ్బంది, అధికారులు పట్టించుకోవడం లేదు.

– పెద్ద వెంకటయ్య, రైతు, కొత్తూరు

వడ్డీ కట్టించుకున్నారు



నాకు రూ.1.40లక్షల పంటరుణం అందింది. ఇందుకు వేయి రూపాయల వడ్డీ కట్టించుకున్నారు. రుణమాఫీ అయినట్లు బ్యాంకు అధికారులు చెప్పడం లేదు. కొత్త పంటరుణం ఇవ్వడం లేదు.

– భద్ర్యానాయక్, రైతు, సూర్యానాయక్‌తండా

ఏఓలు కారణాలు చెప్పాలి



తమ బ్రాంచ్ నుంచి రెండు నెలుగా పంటరుణాల మాఫీ, రుణాల రెన్యూవల్ ప్రక్రియ కొనసాగుతోంది. సగానికి పైగా రైతులకు రుణమాఫీ డబ్బులు వారి ఖాతాల్లో జమకాలేదు. కారణాలు వ్యవసాయాధికారులు తెలియజేయాలి. మాకు రైతులు సహకరించాలి.

– వాసు, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజరు, బొంరాస్‌పేట

ప్రాణాలైనా ఇస్తాం.. ఫార్మాకు భూమిలివ్వం

తహసీల్దార్ కార్యాలయం ఎదుట భూ బాధితుల ఆందోళన



రెవెన్యూ అధికారులను నిలదీస్తూ ఆత్మహత్యకు యత్నించిన మహిళ రైతు

దుద్యాల్: ప్రాణాలైనా ఇస్తాం కానీ.. ఫార్మా కంపెనీలకు భూములిచ్చేది లేదని మండల పరిధిలోని పోలేపల్లి గ్రామానికి చెందిన 35 మంది బాధిత రైతులు తేల్చి చెప్పారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. పోలేపల్లిలోని సర్వే నంబర్ 67లో భూములున్న 35 మంది రైతులు తహసీల్దార్ కార్యాలయానికి రావాలని రెవెన్యూ అధికారులు ఫోన్లు చేశారు. దీంతో వారు అక్కడకు చేరుకుని మమ్ములను ఎందుకు పిలిచారని తహసీల్దార్ దానయ్యను నిలదీశారు. ఆర్డీఓ మీతో చర్చించేందుకు రమ్మన్నారని వివరించారు. మా భూములను బలవంతంగా లాక్కుంటే ఊరుకోమని.. ప్రాణాలకు తెగించి పోరాడుతామని హెచ్చరించారు. పోలేపల్లి ఎల్లమ్మ ఆలయం వద్దే రెవెన్యూ సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులకు రైతులు తేల్చి చెప్పడంతో అందుకు అధికారులు ఒప్పుకొన్నారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో హకీంపేట, లగచెర్ల, పోలేపల్లి, రోటిబండా తండా, పులిచెర్ల తండాలకు చెందిన ఫార్మా భూ బాధితులు పాల్గొన్నారు.

మహిళా రైతు ఆత్మహత్యా యత్నం

తహసీల్దార్ కార్యాలయానికి పిలిచిన రైతులతో తహసీల్దార్ మాట్లాడుతుండగా పోలేపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ రైతు మా భూములు లాక్కోవద్దు సార్ అంటూ పురుగు మందు తాగేందుకు యత్నించింది. దీంతో పక్కనున్న రైతులు వెంటనే తేరుకుని డబ్బా లాగేశారు. దీంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. మా భర్త పేరిట రెండు ఎకరాలు, నా పేరుమీద రెండు ఎకరాల భూమి ఉంది. మొత్తం భూమి లాక్కుంటే మేము ఎలా బతకాలి అంటూ మహిళా రైతు కన్నీరు పెట్టుకుంది.

ఇందూరులో ఒకరికి డెంగీ

చికిత్స పొందుతున్న బాధితురాలు

పెద్దేముల్: మండల పరిధిలోని ఇందూరులో ఒకరికి డెంగీ సోకింది. వివరాలు.. మండల పరిధిలోని ఇందూరు గ్రామానికి చెందిన జ్యోతి (25)కి కర్ణాటక రాష్ట్ర చాంగ్‌లేర్‌తో వివాహమైంది. రక్షాబంధన్ సందర్భంగా వారం రోజుల క్రితం జ్యోతి పుట్టింటికి వచ్చింది. నాలుగు రోజులుగా ఆమె తీవ్రమైన జ్వరంతో ఇబ్బంది పడుతుండగా కుటుంబ సభ్యులు తాండూరులో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు డెంగీ సోకినట్లు నిర్ధారించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని ఆమె సోదరుడు విశ్వనాథం తెలిపారు.



పూడూరు రైతువేదికలో మాట్లాడుతున్న అధికారులు

అర్హులందరికి రుణమాఫీ

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి

పూడూరు: అర్హులందరికి రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీకి సంబంధించి రైతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారందరికి మాఫీ అవుతుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు వరి, పత్తి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పూడూరు పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. అర్హులందరికీ మాఫీ అయ్యేలా చూడాలని.. త్వరితగతిన వివరాలు సేకరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డీఏఓ లక్ష్మీకుమారి, ఏఓ తులసీరాం, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీ ఆత్మహత్య

కద్లాల్: కుటుంబ సమస్యలతో ఉరేసుకొని ఓ వలస కూలీ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల కేంద్రం సమీపంలో సోమవారం రాత్రి వెలుగు చూసింది. మంగళవారం సంఘటనకు సంబంధించిన వివరాలను సీఐ శివప్రసాద్ వెల్లడించారు. వికారాబాద్ జిల్లా చౌడాపూర్‌కు చెందిన కుక్కల నర్సింహ(40), భార్య సుమిత్ర ఇద్దరు పిల్లలతో కలిసి మండల కేంద్రానికి రెండేళ్ల క్రితం వలస వచ్చారు. చెంచుకాలనీలో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నారు. సోమవారం భార్యాభర్తలు మండల కేంద్రానికి చెందిన కోసికే వెంకటేశ్‌కు చెందిన పశువుల షెడ్డు వద్దకు కూలీ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటలకు కుటుంబ సమస్యల విషయంలో ఇద్దరు గొడవ పడ్డారు. సుమిత్ర భర్తకు చెప్పకుండా అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీంతో క్షణికావేశానికి గురైన నర్సింహ సోమవారం సాయంత్రం ఎవరూ లేని సమయంలో అక్కడే ఉన్న తాడుతో పశువుల షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదల వైద్యానికి 'సీఎంఆర్‌ఎఫ్'

తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్: పేదల వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్ అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని సాయిపూర్ ప్రాంతానికి చెందిన రాములు అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి సమస్య వివరించడంతో ఆయన రూ.2.5లక్షల విలువైన ఎల్‌ఓసీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు నర్సింలు తదితరులున్నారు.

నగరేశ్వరాలయంలో..

పట్టణంలోని శ్రీ నగరేశ్వరాలయంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని పలువురికి అన్నదానం చేశారు.

ఆకాష్‌నగర్ సమస్యలను పరిష్కరించండి

మున్సిపల్ పరిధిలోని 8వ వార్డుకు చెందిన ఆకాష్ నగర్ కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కాలనీ ఏర్పడి 15 ఏళ్లు అవుతున్నా నేటికీ సీసీ రోడ్లు, విద్యుత్, మురుగు కాల్వలు తదితర మౌలిక వసతులు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాలనీ వాసుల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కౌన్సిలర్ వెంకన్న గౌడ్, కాంగ్రెస్ నాయకులు జిలాని, కాలనీవాసులు మహ్మద్ ఫరీద్, జలీల్, షాబీర్, ఉమేష్ చారి, పలువురు మహిళలున్నారు.

నజీర్ సేవలు అభినందనీయం



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే

అంబులెన్స్ డ్రైవర్ నజీర్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆస్పత్రి ఆవరణలో ఆరేళ్లుగా నజీర్ ఉచిత అల్పాహారం పంపిణీ చేస్తున్నాడు. ఈ సందర్భంగా ఆ అంబులెన్స్ డ్రైవర్‌ను ఎమ్మెల్యే సన్మానించి అభినందించారు. ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తూ తాను సంపాదించిన దానిలో కొంత భాగం ఆస్పత్రికి వచ్చే అటెండర్లకు, అభాగ్యులు అల్పాహారం రూపంలో పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి ఎమ్మెల్యే వడ్డించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిశంకర్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు హబీబ్ లాలా, నాయకులు డాక్టర్ సంపత్, బంటు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయండి

దళిత బంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్



అనంతగిరి: వినతిపత్రం అందజేస్తున్న దళిత బంధు లబ్ధిదారులు

అనంతగిరి: గత ప్రభుత్వ హయాంలో ఎంపికైన దళిత బంధు లబ్ధిదారులకు ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని దళిత బంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ ఎరన్‌వల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట లబ్ధిదారులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, రామకృష్ణ, వెంకటన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాలను జీపీలు చేయండి

వికారాబాద్ మున్సిపల్ పరిధిలో విలీనమైన గ్రామాలను, వార్డులను ప్రత్యేక పంచాయతీలుగా గుర్తించాలని ఆయా గ్రామస్తులు మంగళవారం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను కోరారు. ఈ మేరకు గిరిగేట్‌పల్లి, జాంబాపూర్‌తండా, కొట్టం గుట్ట తండా, బూర్గుపల్లి, మద్గుల్ చిట్టంపల్లి, గుడుపల్లి, ధన్నారం కొంపల్లి వార్డులను పంచాయతీలుగా గుర్తించాలని అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

డిగ్రీ విద్యార్థుల నుంచి అదనపు వసూళ్లు

తాండూరు టౌన్: డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థుల నుంచి అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారంటూ యునైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(యూఎస్ఎఫ్ఐ) నాయకులు మంగళవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని సింధు డిగ్రీ కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు దీపక్‌రెడ్డి మాట్లాడుతూ.. కళాశాలలో తృతీయ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థుల నుంచి రూ.5వేలు అదనంగా వసూలు చేస్తోందని ఆరోపించారు. అవి చెల్లిస్తేనే సర్టిఫికెట్‌లు ఇస్తామని యాజమాన్యం ఒత్తిడి తెస్తోందని సంఘం నాయకులు, విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ.. ప్రతిని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు అందజేశామన్నారు. ఇందుకు స్పందించిన అదనపు కలెక్టర్ విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తామని.. సదరు కళాశాలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ ఆందోళనలో సంఘం నాయకులు సాయి, శివ, శ్రావణ్, విద్యార్థులు శ్రీనివాస్, లోకేష్, బాల్‌రాజు, అశోక్, శివాని, స్నేహ, శృతి, భవాని, నాగేష్, ఐశ్వర్య పాల్గొన్నారు.

కారులో వచ్చి.. బ్యాటరీలు ఎత్తుకెళ్లి

అర్ధరాత్రి గ్రామాల్లో పార్కు చేసిన వాహనాల్లో బ్యాటరీల చోరీ

మొయినాబాద్: అర్ధరాత్రి సమయంలో బ్యాటరీ దొంగలు హల్ చల్ చేశారు. కారులో వచ్చి ఇళ్ల ముందు, రోడ్ల పక్కన పార్కు చేసిన వాహనాల బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాతి దుండగులు నంబర్ ప్లేట్ లేని కారులో వచ్చి ఎలుకగూడ, రెడ్డిపల్లి, పెద్దమంగలారం గ్రామాల్లో పార్కుచేసిన వాహనాల 9 బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. ఎలుకగూడలో గుడుపల్లి రాజు, కుండె శ్రీనివాస్‌లకు చెందిన ట్రాక్టర్ బ్యాటరీలు, ఆలూరి వెంకటేశ్‌కు చెందిన ఆటో బ్యాటరీ, టి.జగదీష్‌కు చెందిన కారు బ్యాటరీ దొంగలించారు. రెడ్డిపల్లిలో కుండె కమల్, ఇంద్రసేనారెడ్డిలకు చెందిన ట్రాక్టర్ బ్యాటరీలు, వడ్డె ఆంజనేయులు ఆటో బ్యాటరీ ఎత్తుకెళ్లారు. పెద్దమంగళారంలోనూ రెండు కార్ల బ్యాటరీలు దొంగిలించారు. ఉదయం లేచి చూసేసరికి వాహనాల బ్యాటరీలు లేకపోవడంతో బాధితులంతా మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

తెగబడుతున్న దొంగలు

గత కొంత కాలంగా మొయినాబాద్, శంషాబాద్ ప్రాంతాల్లో బ్యాటరీ దొంగలు తెగబడుతున్నారు. అర్ధరాత్రి సమయంలో వచ్చి పార్కుచేసిన వాహనాల బ్యాటరీలను ఎత్తుకెళ్తున్నారు. మొయినాబాద్ మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో గత నెల రోజుల క్రితం డోజర్లు, కార్ల బ్యాటరీలు ఎత్తుకెళ్లారు. రెడ్డిపల్లిలో నెల రోజుల క్రితం నాలుగు ట్రాక్టర్ బ్యాటరీలు దొంగలించారు. మొయినాబాద్‌లోని ఓ మెకానిక్ షెడ్‌లో ఉన్న కార్ల బ్యాటరీలను సైతం దుండగులు అపహరించుకుపోయారు. కొంత కాలంగా తరచూ బ్యాటరీ దొంగతనాలు చేస్తున్న దుండుగులు నంబర్ ప్లేట్ లేని కార్లలో వచ్చి పోలీసులకు చిక్కకుండా చాకచక్యంగా తప్పించుకుంటున్నారు. ప్రస్తుతం బ్యాటరీ దొంగలను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్టు

షాద్‌నగర్‌రూరల్: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు షాద్‌నగర్ పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. వారి వివరాల ప్రకారం.. షాద్‌నగర్ పట్టణంలోని గాంధీనగర్ కాలనీ చెందిన సూరమోని శ్రీశైలం, ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామానికి చెందిన భీష్వ రాజులు కొంత కాలంగా పట్టణంలో వైన్స్ దుకాణాల ఎదుట.. రైల్వే, బస్టాండ్‌లో నిలిపిన ద్విచక్ర వాహనాల హ్యాండిల్స్‌ను విరగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్నారు. దొంగిలించిన వాహనాలకు అమ్ముకొని జల్సాలు చేస్తున్నారు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన ముడావత్ కమల్యానాయక్ తన వాహనం చోరీ జరగడంతో ఈనెల 8న ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్న శ్రీశైలం, రాజులు పట్టుకొని అరెస్టు చేశారు. నిందితుల నుంచి ఐదు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్ఐ శరత్‌కుమార్, సిబ్బంది కృష్ణ, శంకరయ్య, మహేష్, రాజేష్, రఫీలు చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించినట్లు సీఐ తెలిపారు.

తల్లి, భార్యపై చిందులు

భూమి అమ్మొద్దన్నందుకు వ్యక్తి వాగ్వాదం

బషీరాబాద్: భూమి అమ్మడాన్ని అడ్డుకుంటున్న తల్లి, భార్యపై ఓ వ్యక్తి చిందులేశాడు. ఈ ఘటన మంగళవారం బషీరాబాద్ పీఎస్ ఆవరణలో చోటుచేసుకుంది. ఎక్మాయికి చెందిన శాంతకుమార్ లారీ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈఎంఐ చెల్లించకపోవడంతో ఫైనాన్స్ వారు లారీని తీసుకెళ్లారు. ఈక్రమంలో లారీని తెచ్చుకునేందుకు భూమి అమ్మకానికి సిద్ధపడ్డాడు. ఈ విషయాన్ని తల్లి కాంతమ్మకు చెప్పడంతో.. ఇప్పటికే భూమి అమ్మి, లారీ తెచ్చావు.. మళ్లీ భూమి అమ్మితే భార్యాబిడ్డలు ఎలా బతుకుతారని నిలదీసింది. ఈక్రమంలో సోమవారం నుంచి తల్లి, భార్యతో గొడవపడుతున్నాడు. భూమికి అడ్డొస్తే ఇద్దరినీ చంపేస్తానని బెదిరిస్తున్నాడు. దీంతో తల్లి, భార్య మంగళవారం ఉదయం పోలీసులను ఆశ్రయించారు. శాంతకుమార్‌ను పీఎస్‌కు పిలిపించగా పోలీసుల ఎదుటే తల్లి, భార్యపై దాడికి ప్రయత్నించాడు. దీంతో పోలీసులు అతన్ని గట్టిగా మందలించి పంపించారు.

వ్యక్తి బలవన్మరణం

మొయినాబాద్: అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఓ వ్యక్తి మనస్తాపానికి గురై ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చిలుకూరులో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన సంగెరి కుమార్(42) మృగవని జాతీయ పార్కులో దినసరి కూలీగా పనిచేసేవాడు. ఆయన కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఇటీవల ఆరోగ్యం మరింత క్షీణించడంతో మనస్తాపానికి గురై తెల్లవారుజాము పొలం వద్దకు వెళ్లి ఉరేసుకున్నాడు. ఉదయం అటుగా వెళ్లిన వారు గమనించి పోలీసులు, కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వివరాలు సేకరించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార ముఠా గుట్టురట్టు

11 మంది అరెస్ట్



అరెస్ట్ చేసిన విటులు, లాడ్జి యజమాని, మేనేజర్

తాండూరు టౌన్: వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ లాడ్జిపై తాండూరు పట్టణ పోలీసులు దాడి చేశారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని సిద్ధి వినాయక లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు దాడి చేసి నాగిరెడ్డిపల్లికి చెందిన కావలి యాదయ్య, మద్వాపూర్‌కు చెందిన బంటు శ్రీకాంత్, గుడిపల్లి గోవింద్, పర్వతాపూర్‌కు చెందిన పిచ్చకుంట్ల ఎల్లప్పతో పాటు వ్యభిచారం చేస్తున్న ఐదుగురు మహిళలు, లాడ్జి యజమాని ఇందూర్ నరేందర్, మేనేజర్‌లను పుట్టి రవిని అరెస్టు చేశారు. మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైద్యుడి వక్ర బుద్ధి

పహాడీషరీఫ్: నర్సుతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ వైద్యుడిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కందుకూరులోని లిమ్స్ ఆస్పత్రిలో ఓ యువతి (19) చదువుకుంటూనే నర్సుగా పని చేస్తోంది. ఇదే ఆస్పత్రిలో మార్కండేయ వైద్యుడిగా కొనసాగుతున్నాడు. సోమవారం రాత్రి ఇంటికెళ్లేందుకు సిద్ధమైన యువతిని.. తానూ అదే మార్గంలో వెళ్తున్నానని, డ్రాప్ చేస్తానని చెప్పి కారులో ఎక్కించుకున్నాడు. అనంతరం డబుల్ మీనింగ్ డైలాగులతో మాట్లాడటం ప్రారంభించాడు. మౌనంగా భరించిన యువతి బాలాపూర్ వద్ద కారు దిగింది. ద్వంద్వ అర్థాలతో, లైంగిక పరమైన మాటలతో తనను ఇబ్బంది పెట్టిన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పహాడీషరీఫ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.